
సాక్షి
బాపట్ల
బుధవారం ః 19 ః జూన్ ః 2024



శాంతి కల్యాణం

ఫిరంగిపురం: వేమవరం గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 504.50 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

వినాయక దేవాలయ వార్షికోత్సవం



సత్తెనపల్లి: పట్టణంలోని నందిగామ డొంకలో వేంచేసి ఉన్న వినాయక స్వామి దేవాలయ వార్షికోత్సవ సందర్భంగా వినాయకుడికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అన్నదాతకు వెన్నుదన్ను



స్నాతకోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపకులపతి ఆర్.శారద జయలక్ష్మీదేవి, ఆచార్యులు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీధర్

- నేడు వ్యవసాయ కళాశాల స్నాతకోత్సవం
- గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక
- కరపత్రాలు ఆవిష్కరించిన ఉప కులపతి ఆర్.శారద జయలక్ష్మీదేవి

బాపట్ల: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 56వ వార్షిక స్నాతకోత్సవం ఈ నెల 19న బాపట్ల వ్యవసాయ కళాశాలలో నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆర్.శారద జయలక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం బాపట్ల వ్యవసాయ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ షేక్ అబ్దుల్ నజీర్ హాజరవుతారని తెలిపారు. ముఖ్య అతిథిగా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆమె తెలిపారు. విద్యార్థులకు పట్టాల పంపిణీ, ఆర్థిక పురస్కారాలు అందిస్తారని తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం విశిష్టతను సంక్షిప్తంగా వివరించారు. రైతులకు అనేకరకాలుగా ప్రకృతి విపత్తుల సమయాల్లో వెన్నుదన్నుగా నిలవడంతో పాటు మేలు రకాల విత్తనాలు, అధిక దిగుబడులను ఇచ్చే వ్యవసాయ వంగడాలను రైతులకు అందించడంలో విశ్వవిద్యాలయం విశేష కృషి చేస్తోందన్నారు. సుమారుగా 500 పైబడిన మేలైన వ్యవసాయ వంగడాలను అందించిందని తెలిపారు. బాపట్లలో జరిగే స్నాతకోత్సవంలో విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న ఆరు వ్యవసాయ కళాశాలల విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు అందజేస్తారని ఆమె తెలిపారు. అదేవిధంగా 56వ వార్షికోత్సవంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంలో 17 బంగారు పతకాలు, అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంలో 4 బంగారు పతకాలతోపాటు బోధన, పరిశోధన, విస్తరణలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 10 అవార్డులను అందజేస్తారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా స్నాతకోత్సవ కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు, పీజీ స్టడీస్ డీన్ ఏవీ రమణ, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ మణి, కమ్యూనిటీ సైన్స్ డీన్ శ్రీలక్ష్మి, బాపట్ల వ్యవసాయ కళాశాల ఏడీ వి.శ్రీనివాసరావు, కళాశాల ఆచార్యులు రమాదేవి, పి.అనిల్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటన విజయవంతం చేయండి

బాపట్ల: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ బాపట్ల జిల్లా పర్యటనను జయప్రదం చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ అధికారులకు సూచించారు. గవర్నర్ పర్యటనపై జిల్లా అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం 56వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ పాల్గొంటారని జేసీ శ్రీధర్ తెలిపారు. రాష్ట్ర గవర్నర్ జిల్లాలోకి ప్రవేశించినప్పటి నుంచి తిరిగి వెళ్లేవరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. పటిష్టమైన భద్రత కల్పించాలని ఆయన సూచించారు. గవర్నర్ పర్యటనలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. అత్యవసరమైన వైద్యసేవలకు వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. గవర్నర్ పర్యటనలో కాన్వాయ్ వాహనాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగే కార్యక్రమాలకు ఎలాంటి విఘాతం ఏర్పడకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తెనాలిలో కుండపోత



తటాకాన్ని తలపిస్తున్న కూడలి

తెనాలిఅర్బన్: తెనాలిలో మంగళవారం మధ్యాహ్నం కుండపోత వాన కురిసింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం జనజీవనాన్ని స్తంభింపజేసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రతతో అల్లాడిన ప్రజలు మధ్యాహ్నం వాతావరణం చల్లబడడంతో కొద్దిసేపు సేదదీరారు. ఆ తర్వాత ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం సుమారు రెండు గంటలపాటు ఏకధాటిగా కురిసింది. దీంతో తెనాలి పట్టణంలోని బోసు రోడ్డు, గాంధీచౌక్, నాజర్‌పేట, బుర్రిపాలెం రోడ్డు, మారీసుపేట, తెనాలి పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. సాయంత్రం వేళ కావడం పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. వాన వెలిశాక సుమారు 2 గంటల వరకు నీరు బయటకు పోలేదు. తెనాలి మండలంలోని పలు గ్రామాల్లోనూ భారీ వర్షం కురిసింది. కొన్నిచోట్ల ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగింది. కొన్ని గ్రామాల్లో సుమారు మూడు గంటలపాటు విద్యుత్ లేకపోవడంతో ప్రజలు అల్లాడారు.

పిడుగుపాటుకు రెండుగా చీలిన వృక్షం

తెనాలిరూరల్: తెనాలి మండలం సోమసుందరపాలెం నుంచి కంచర్లపాలెం వెళ్లే దారిలో ఆటో నగర్ వెనుక ఉన్న భారీ వృక్షం పిడుగుపాటుకు రెండుగా చీలిపోయింది. దీని వెంబడే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో చీలిన వృక్షభాగం విద్యుత్ తీగలపై పడింది. దీంతో తీగలు తెగిపోవడమే కాకుండా కొన్ని విద్యుత్‌స్తంభాలు విరిగిపడ్డాయి. ఫలితంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో చెట్టును తొలగించి మరమ్మతులు చేపట్టారు. చేబ్రోలు, తెనాలి, దుగ్గిరాల మండలంలోనూ పలు చోట్ల విద్యుత్‌స్తంభాలు నేలకొరిగినట్టు అధికారులు తెలిపారు.

మిరప మిరుమిట్లు!

- గతేడాది పల్నాడు జిల్లాలో 50,138 హెక్టార్లలో మిర్చి సాగు
- ప్రస్తుత సంవత్సరంలో 75,220 హెక్టార్లలో సాగు అంచనా
- ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులు మిర్చి వైపు మొగ్గు
- 18,805 కిలోల మిర్చి విత్తనాలు అవసరం
- ప్రతిపాదనలు పంపిన ఉద్యానశాఖ అధికారులు
- నర్సరీలో నారు సాగుకు సిద్ధమవుతున్న నిర్వాహకులు



రెంటచింతలలోని ఓ నర్సరీలో మిర్చి నారు (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లాలో ఈ ఏడాది మిర్చి సాగు గణనీయంగా పెరగనుందని ఉద్యాన శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మార్కెట్‌లో మిర్చి ధర ఆశాజనకంగా ఉండటంతో రైతాంగం మిర్చి సాగుపైనే ఎక్కువ దృష్టి చూపుతున్నారు. గతేడాది దిగుబడి బాగా రావడం, సరాసరి ధర రూ.20 వేలపైనే ఉండటంతో మిర్చి సాగుచేసిన రైతులకు లాభాలు అందాయి. అదే ఉత్సాహంతో ఈ ఏడాది రైతుల, కౌలు రైతులు మిర్చి సాగుకు ముందుకు వస్తున్నారు. గతేడాది పల్నాడు జిల్లాలో 50,138 హెక్టార్లలో మిర్చి సాగు జరిగింది. ప్రారంభంలో వర్షాలు కురిసినప్పటికీ సీజన్‌లో తక్కువ వర్షపాతం నమోదు అవ్వడంతో మిర్చి పంట సాగు అనుకున్న దానికన్నా తక్కువ జరిగింది. పంటను కాపాడుకున్న రైతులకు కొంత మెరుగైన దిగుబడులు రావడంతోపాటు ధర కలసి రావడం వారికి మేలుచేసింది. ఈ ఏడాది ఇది 75,220 హెక్టార్లుగా ఉంటుందని ఉద్యాన శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా వర్షాలు మొదలవ్వడంతో రైతులు భూములను సిద్ధం చేసుకుంటున్నారు. వెల్దుర్తి, దుర్గి, కారంపూడి, పిడుగురాళ్ల వంటి చోట్ల మిరప పంట సాగు మొదలైంది.

18,805 కిలోల విత్తనాలు

మిర్చి సాగు ఆశించిన స్థాయిలో ఉంటుందని భావించిన ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు విత్తన కంపెనీలతో ఈ ఏడాది మార్చి 13వ తేదీనే సమావేశం ఏర్పాటు చేశారు. అందులో భాగంగా పల్నాడు జిల్లాకు ఈ ఏడాది సాగు అంచనా 75,220 హెక్టార్లకుగాను 18,80,500 మిర్చి విత్తనాల 10 గ్రాముల ప్యాకెట్లు కావాలని అంచనా వేశారు. విత్తనాలు సరఫరా చేసే 20 కంపెనీలకు మొత్తం 18,805 కేజీల మిర్చి విత్తనాలు అవసరమని ఉద్యాన శాఖ ఇండెంట్‌ను వ్యవసాయశాఖ పంపింది. ఈమేరకు విత్తనాలు ఆయా కంపెనీలతో సరఫరా చేయిస్తున్నారు. జిల్లాలో ఆర్మూర్, జీసీ2626, తేజా సిగ్మెంట్స్ రకాల విత్తనాలకు మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉంది.

గతేడాది మిర్చి పంట సాగు	ఈ ఏడాది మిర్చి సాగు అంచనా
50,138 హెక్టార్లు	75,220 హెక్టార్లు
ఉద్యానశాఖ జిల్లాకు అంచనా వేసిన మిరప విత్తనాల పరిమాణం 18,805 కిలోలు	

నారు సాగుకు సిద్ధమవుతున్న నర్సరీలు

మిర్చి సాగు లాభమని భావించిన రైతులు ఈ ఏడాది అధిక మొత్తంలో మిరప సాగుకు సన్నద్ధమవుతున్నారు. దీంతో నర్సరీ నిర్వాహకులు నారు సాగుకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం నర్సరీలలో బెడ్లు సిద్ధం చేసుకొని విత్తనాల సాగుకు సమాయత్తమవుతున్నారు. జూలై మొదటి వారం నుంచి నర్సరీల్లో మిర్చి నారుకు విత్తనాలు వేయనున్నారు. నర్సరీలలో నకిలీ విత్తనాలు సాగు చేసి రైతులు మోసపోకుండా ఉండేందుకు ఉద్యానశాఖ అధికారులు ఆయా నిర్వాహకులను అప్రమత్తం చేస్తున్నారు. నాణ్యమైన విత్తనాలనే వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆగస్టు నెల రెండో వారం నుంచి రైతులు నారును తమ నేలల్లో నాటనున్నారు. వర్షపాతం ఆధారంగా ఇది అక్టోబర్ చివరి వరకు కొనసాగే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలో ఒకటి రెండు వర్షాలు కురవడంతో రైతులు తమ పొలాల్లో దుక్కి దున్ని సాగుకు సిద్ధమవుతున్నారు.

డిమాండ్‌కు తగ్గట్టుగా అందుబాటులో మిరప విత్తనాలు



మిర్చికి మంచి ధర పలుకుతుండటం ఈ ఏడాది మిరప సాగు అధికంగా ఉంటుందని అంచనా వేశాం. ఖరీఫ్‌లో 75,220 హెక్టార్లలో సాగు జరుగుతుందని అంచనా వేసి అందుకు అనుగుణంగా జిల్లాకు 18,805 కిలోల మిర్చి విత్తనాలు అవసరమని ఇండెంట్ పంపాం. జిల్లాలో నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా రైతులకు విత్తనాల లభ్యత ఉంటుంది. ఇప్పటికే విత్తన కంపెనీలతో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించాం.

– సీహెచ్‌వీ రమణారెడ్డి, పల్నాడు జిల్లా ఉద్యాన శాఖ అధికారి.

పది ఎకరాల్లో సాగుకు సిద్ధం



మిర్చి ధర ఆశాజనకంగా ఉండటంతో ఈ ఏడాది పది ఎకరాల్లో సాగు చేసేందుకు సన్నద్ధమయ్యాను. గుంటూరు మిర్చి యార్డులో మిరపకు మంచి డిమాండ్ ఉండటంతో పంటకు గిట్టుబాటు ధర లభిస్తోంది. గతేడాది క్వింటాల్ ధర అత్యధికంగా రూ.27వేలు దాకా పలకడంతో రైతులంతా మిర్చి పంట సాగుకు ముందుకు వస్తున్నారు. దీంతో మార్కెట్‌లో మిర్చి విత్తనాలకు బాగా డిమాండ్ పెరగనుంది.

– డి హనిమిరెడ్డి, రైతు, శిరిగిరిపాడు, వెల్దుర్తి మండలం

వెంబడించి.. నగదు తస్కరించి..

- మార్టూరులో సినీ ఫక్కీలో నగదు చోరీ
- రూ.1.04 లక్షలు దొంగిలించిన దుండగులు



బ్యాంకు సీసీ కెమెరాలో నిందితుడు

మార్టూరు: మార్టూరులో సినీ ఫక్కీలో చోరీ జరిగింది. బ్యాంకులో నగదు డ్రా చేసుకొని వెళ్తున్న తండ్రి, కొడుకులను నిశితంగా గమనించి, అనుసరించి రూ.1.04 లక్షల నగదును ఇద్దరు ఆగంతకులు చోరీ చేసిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. నాగరాజుపల్లి ఎస్సీ కాలనీకి చెందిన రామకూరి పెద్దబ్బాయి తన తండ్రి వెంకయ్యతో కలిసి గత శనివారం మధ్యాహ్నం తమ బైక్ పై మార్టూరు వచ్చారు. వ్యవసాయ పనుల నిమిత్తం స్థానిక స్టేట్ బ్యాంకులో లక్ష నాలుగు వేల రూపాయలను డ్రా చేశారు. అనంతరం నగదును బైకు పెట్రోల్ ట్యాంకుపై ఉన్న కవర్లో పెట్టుకొని పెద్దబ్బాయి పిల్లల స్కూలు అడ్మిషన్ కోసం స్థానిక వివేకానంద పాఠశాలకు ఇద్దరు వెళ్లారు. బైకును స్కూలు గేటు ముందు ఉంచి లోపలికి వెళ్లి పది నిమిషాల్లో బయటకు వచ్చారు. బైకు కవరులో ఉండాల్సిన నగదు సంచి కనిపించకపోవడంతో కంగారుపడిన తండ్రి, కొడుకులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. బ్యాంకు, పాఠశాల పరిసరాలలోని సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులకు దొంగల పనితీరు అర్థం అయింది. ఓ పథకం ప్రకారం చోరీ కోసం రెండు బైకుల్లో వచ్చిన ఇద్దరు ఆగంతకులలో ఒకడు వాహనాన్ని బ్యాంకు ముందుగల హైవే అండర్ పాస్ కింద ఉంచి వేచి చూస్తున్నాడు. ఇంకో నిందితుడు బాధితులు బ్యాంకులో నగదు డ్రా చేసే సమయంలో బ్యాంకులోనే ఉండి వీరు నగదు డ్రా చేసిన విషయం గమనిస్తూ వీరికంటే ముందే బయటకు వచ్చి ఏటీఎం వద్ద ఉన్న తన బైక్ పై ఎదురు చూస్తున్నాడు. ఇదేమీ తెలియని వెంకయ్య, పెద్దబ్బాయిలు తమ బైకుతో వివేకానంద పాఠశాల వైపు బయలుదేరారు. నిందితుడు వీరిని ఫాలో అవుతూ పాఠశాల వద్దకు రావటం, బాధితులు పాఠశాలలోనికి వెళ్లి బయటకు వచ్చేలోగా వారి బైకు కవరులో ఉన్న నగదును తస్కరించివెళ్లిపోవడం నిమిషాలల్లో జరిగిపోయింది. నిందితుల ప్రతి కదలిక సీసీ కెమెరాల్లో స్పష్టంగా నమోదయింది. పెద్దబ్బాయి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు.

జీజీహెచ్‌లో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వార్డు

- ప్రారంభించిన డాక్టర్ కిరణ్ కుమార్
- పది పడకలతో రోగులకు సేవలు
- త్వరలో 40 పడకల ఏర్పాటుకు సన్నాహాలు



ప్రారంభిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజి వార్డును రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. మంగళవారం ట్రామా ఐసీయూ స్థానంలో కొత్తగా ఏర్పాటైనా సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వార్డును ఆయన ప్రారంభించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ అనేక సంవత్సరాల తర్వాత జీజీహెచ్‌లో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాన్ని రోగులకు అందుబాటులోకి తీసుకు వచ్చామని చెప్పారు. ట్రామా ఐసీయూలో నాలుగైదు పడకలు మాత్రమే ఉండేవని, కొత్త ఆలోచనతో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజి వార్డుగా మార్చి పది పడకలను సిద్ధం చేశామని తెలిపారు. రానున్న రోజుల్లో పాదిల ప్రసాద్ బ్లాక్‌లోని నాలుగో అంతస్తులో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ 40 పడకలను సిద్ధం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. లివర్ గ్యాస్ట్రో ఎంటరాలజి ఆపరేషన్లు, క్లిష్టమైన ఆపరేషన్లు చేసేందుకు సిబ్బందిని నియమించామని పేర్కొన్నారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వ్యాధితో బాధపడే రోగులు గతంలో తిరుపతిలోని సిమ్స్‌కు, తెలంగాణలోని హైదరాబాద్‌కు పంపించాల్సిన పరిస్థితి ఉండేదని, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, డీఎంఈ డాక్టర్ నరసింహం నిర్ణయం మేరకు ఈ విభాగాన్ని కొత్తగా ప్రారంభించినట్లు వెల్లడించారు. అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ పోస్టులు ఉండటంతో ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టును గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి కేటాయించేలా శ్రద్ధ తీసుకున్నారని, దీంతో కొత్తగా సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అందే కోటి వెంకటేశ్వరావు వచ్చారని వివరించారు. ఈ విభాగంలో ఇంకా ఒక ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సిబ్బందిని కేటాయించాలని ప్రభుత్వానికి లేఖ రాస్తామని చెప్పారు.

న్యూస్‌రీల్

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

మార్టూరు: వర్షంలో చెట్టు కింద నిలబడిన ఓ గొర్రెల కాపరి పిడుగుపాటుకు మృతి చెందాడు. ఈఘటన మండలంలోని జొన్నతాళి గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగింది. జొన్నతాళికి చెందిన గోవాడ శ్రీనివాసరావు(50) గొర్రెలను మేపటం కోసం ఉదయం పొలాల వైపు వెళ్లాడు. ఉరుములు, మెరుపులతో కురుస్తున్న భారీ వర్షానికి చెట్టు కింద నిలబడగా, సమీపంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడు శ్రీనివాసరావుకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితులకు ఐదేళ్ల జైలు

బాపట్లటౌన్: హత్యాయత్నం కేసులో నిందితులకు జైలుశిక్ష ఖరారుచేస్తూ మంగళవారం బాపట్ల ప్రిన్సిపల్ సెషన్స్ సివిల్‌జడ్జి జి.వాణికుమారి తీర్పు వెల్లడించారు. కేసు విచారణలో భాగంగా ఖమ్మం జిల్లా, యర్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించే హెడ్‌కానిస్టేబుల్ పడల వెంకటేశ్వర్లు, హోంగార్డు విజయ్‌కుమార్‌లు 2013 ఏప్రిల్ 7న బాపట్ల మండలం, స్టువార్టుపురంలో నివాసం ఉంటున్న మానుపాటి దుర్గాప్రసాద్ అలియాస్ చిన్నోడు, మానుపాటి వెంకటేశ్వర్లు అలియాస్ పెద్దోడుల ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో ముద్దాయిలైన దుర్గాప్రసాద్, వెంకటేశ్వర్లు ఇంటి వద్ద లేరు. వారికోసం గాలింపులో భాగంగా సాయంత్రం 5 గంటలకు వెదుళ్లపల్లి మార్కెట్ సెంటర్‌కు చేరుకున్నారు. మార్కెట్‌సెంటర్‌లో హెడ్‌కానిస్టేబుల్, హోంగార్డులు ఉండటాన్ని గమనించిన ముద్దాయిలు ఇరువురూ వారిపై కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటనలో ముద్దాయిలు ఇరువురిపై వెదుళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో ముద్దాయిలు ఇరువురికి ఐదు సంవత్సరాల జైలుశిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించింది. బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ, సీఐ హజరత్‌బాబు, వెదుళ్లపల్లి ఎస్ఐ బి.అజిత, కోర్టు మానిటరింగ్ సిబ్బంది జి. శ్రీనివాసరావు, సీహెచ్ అశోక్‌లను జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు.

ఆర్వో ప్లాంట్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేత



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం పాత ఉప్పలపాడు గ్రామం జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌కు విద్యుత్ అధికారులు సరఫరా నిలిపివేశారు. కాలనీ ప్రజలకు తాగునీరు అందించే పథకం సక్రమంగా పనిచేయకపోవడంతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కేవలం రూ.5లకే 20 లీటర్ల క్యాన్ అందిస్తున్నారు. ప్లాంట్ వైఎస్సార్ సీపీ వారు ఏర్పాటు చేశారనే నెపంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

25న క్యాంపస్ ఇంటర్వ్యూలు

మాచర్ల: పల్నాడు జిల్లా ప్రభుత్వ గురుకుల పారిశ్రామిక శిక్షణా కేంద్రంలో (మాచర్ల పీడబ్ల్యూ కాలనీలో) ఈనెల 25 ఉదయం 10 గంటలకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్.ఎస్.వి.ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ప్రకటించిన విధంగా 26న కాకుండా 25న ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రముఖ కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు.

హుండీ ఆదాయం రూ.32 లక్షలు



దుర్గి: అడిగొప్పులలోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి హుండీ కానుకలు లెక్కించగా రూ.32,36,935 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహణాధికారి సైదమ్మ బాయి తెలిపారు. మంగళవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కారంపూడి గ్రూప్ టెంపుల్స్ కార్యానిర్వాహణాధికారి కృష్ణంరాజు ఆధ్వర్యంలో 43 రోజులపాటు భక్తులు అమ్మవారికి సమర్పించిన హుండీ లెక్కింపు చేపట్టారు. కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని బ్యాంకు అధికారులకు అందజేసి సంబంధిత రసీదును తీసుకున్నట్లు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, అడిగొప్పుల సిబ్బంది, ఎన్ఎంఆర్ సిబ్బంది, అర్చక, పరిచారక, నాయీ బ్రాహ్మణులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వివాదాలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు

పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్



చిలకలూరిపేట: ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ చెప్పారు. చిలకలూరిపేట అర్బన్, రూరల్ పోలీసుస్టేషన్లను మంగళవారం ఆమె సందర్శించారు. అర్బన్ పోలీసుస్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా 400 మందిపై రౌడీషీట్లు పెట్టినట్లు తెలిపారు. వీటిని సమీక్షించి పాత కేసులు తొలగిస్తామన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణా నియంత్రణకు అవసరమైన వాహనాల తనిఖీ నిర్వహిస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లాలోని పోలీసుస్టేషన్లను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. చిలకలూరిపేటలో జాతీయ రహదారి విస్తరించి ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు.

పొట్టి శ్రీరాములుకు భారతరత్న ప్రకటించాలని వినతి

తెనాలిఅర్బన్: ఆంధ్రరాష్ట్ర అవతరణకు విశేష కృషి చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు భారతరత్న ప్రకటించేలా కృషి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి నాయకులు కోరారు. మంగళవారం బోసురోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో వారు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.అమరావతిలో పొట్టి శ్రీరాములు భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టాలని కోరారు. ముందుగా మంత్రి నాదెండ్లకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గుడివాడ వేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు పొట్టి శంకర్‌నారాయణ, ఉపాధ్యక్షులు ఆలపాటి శివనరసింహారావు, ప్రధాన కార్యదర్శి చుండూరు సాయి, కోశాధికారి అరవీటి బాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగుళూరులో కంప్యూటర్, ట్యాలీ నైపుణ్యంపై ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి హరిప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 28 ఏళ్లలోపు వయసు గల అభ్యర్థులకు బెంగుళూరులో 35 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ ఇస్తామని వెల్లడించారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, స్పోకెన్ ఇంగ్లిషు, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ ఇచ్చి, శిక్షణానంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15వేలకు పైబడిన వేతనంతో నూరు శాతం ఉద్యోగాలను చూపిస్తామని వివరించారు. ఇతర వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

పొన్నూరులో భారీ వర్షం



పొన్నూరు: పొన్నూరులో మంగళవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు, రహదారులు చెరువులను తలపించాయి. వర్షంలో తడుస్తూనే వాహనదారులు ప్రయాణం సాగించారు. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉండగా మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై వాన కురిసింది. మున్సిపల్ కార్యాలయం, ఆర్టీసీ బస్ డిపో, తహసిల్దార్ కార్యాలయంతో పాటు పట్టణంలోని పలు వీధులు నీట మునిగాయి.

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): ఆలయంలో చోరీ చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసు స్టేషన్ సీఐ షేక్ అన్వర్‌బాషా తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 12న రాత్రి కొత్తపేటలోని చిన్న మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తి గుడి తలుపులు పగులగొట్టి హుండీలోని రూ.25వేలు నగదు అపహరించుకుపోయాడు. సీసీ ఫుటేజీ, సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని రామిరెడ్డితోటకు చెందిన షేక్ షమీర్‌గా గుర్తించిన పోలీసులు మంగళవారం మణిపురం ఓవర్‌బ్రిడ్జి వద్ద అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించడంతో చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు.

గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్., తెనాలి
GDCC BANK
కేంద్ర కార్యాలయము : తెనాలి
పరిపాలనా కార్యాలయము : గుంటూరు.

మహాజన సభ సమావేశపు వాయిదా నోటీసు

గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లి., తెనాలి నెం. 530 యొక్క మహాజన సభ వాయిదా

తేది : 20-06-2024 గురువారం
సమయము : ఉదయం 11 గం॥లకు

జరగవలసిన గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ తెనాలి యొక్క మహాజన సభ సమావేశము అనివార్య కారణాల వలన వాయిదా వేయడమైనది. కావున బ్యాంకు మహాజన సభ్యులందరికీ తెలియజేయడమైనది. తదుపరి తేదీ తరువాత తెలియజేయగలవారము.

ప్రదేశం : గుంటూరు
తేది. 18-06-2024
అన్ని సభ్య సంఘములకు

సం/- శ్రీమతి టి. కృష్ణవేణి
చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

COACHING

■ DSC SGT & SA:Telugu, Hindi, Maths, Social, Biology Class Starts: 20/06/24 హాస్టల్ వసతి కలదు/ అడ్మిషన్ జరుగుచున్నవి. శ్రీ వర్షిని కోచింగ్ సెంటర్ 2/6 బ్రాడీపేట, గుంటూరు. 9440214612, 9553534072

REAL ESTATE

FLAT FOR SALE

■ గుంటూరు సిటీ, అమరావతి రోడ్‌కు దగ్గరలో వారాహి ఇన్‌ఫ్రా నంది హోమ్స్‌లో 3X విల్లాస్ మరియు సత్తెనపల్లిలో షణ్ముఖ రాయల్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్ట్స్‌లో అపార్ట్‌మెంట్స్, విల్లాస్ & డూప్లెక్స్ హౌసెస్ అమ్మకమునకు కలవు. ఫుల్ ఫినిష్డ్ రెడీ టూ ఆక్యుపై. బ్యాంకు లోన్ సౌకర్యం కలదు. AP RERA No. P07150120231. ✆ 97016 89312

■ పద్మిక నివాస్: ఇన్నర్ రింగ్‌రోడ్డు రైల్వేగేటు దగ్గర అత్యంత నాణ్యతతో గార్డెన్ & వాటర్ ఫౌంటెన్‌తో 2BHK ఫుల్ ఫినిష్డ్ లగ్జరీ ఫ్లాట్స్ 40 లక్షలకే. ఫోన్ 98481 10543, 70936 09070.

SERVICES

■ Fango Ferry Pvt. Ltd. కంపెనీ మరియు Fango Ferry Foundation తరఫున పని చేయుటకు ఏజెంట్లు కావలెను. గౌరవ వేతనం +కమీషన్ (షరతులు వర్తిస్తాయి.)9618444934

BUSINESS OFFER

■ లాభదాయకమైన వ్యాపారం కోసం లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్ స్థాపించండి. ప్లాస్టిక్ ఉద్యోగ్‌తో బై బ్యాక్ అగ్రిమెంట్. (Govt. అప్రూవ్డ్) 8376001873, 9643010487, 8376089771, 011-25920179

WANTED

■ గుంటూరు గార్డెన్స్ నందు బెడ్ పేషెంట్‌ను చూసుకొనుటకు 35 సం॥ లోపు మగ మనిషి కావలెను. టైమింగ్స్ - 10:00 am to 7:30 pm. ✆ 70362 51234

■ మా ఆఫీస్‌లో పనిచేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్ కావలెను.Females మాత్రమే.జీతం:10-15వేలు. 13వలైన్, అరండల్‌పేట,గుంటూరు: 7330711162, 9100472954

■ Wanted B.Ed Laddy Teachers to Teach 6th to 10th Classes in English medium, Food & Accommodation Available. Guntur. Ph: 94918 98905

■ భారతపేట గుంటూరు రోజూ 3 లేదా 6గం॥ క్రైస్తవ విజ్ఞాపన చేయగల స్త్రీ/పు లోకల్ వారు కావలెను. నెలకు 3/7వేలు కానుక కలదు. క్రైస్తవ పెళ్ళి సంబంధాల కొరకు సంప్ర॥ 7989721270

■ తెనాలిలోని కాలేజ్ హాస్టల్‌లో పని చేయుటకు వంటవారు కావలెను. 50 మంది హాస్టల్లో ఉంటారు. ఆసక్తిగలవారు సంప్ర: వైష్ణవి జూ॥కాలేజ్, స్టేషన్‌రోడ్. 9290769284

■ Wanted Male Campus incharges, Male Marketing Vice Principals and Executives Qualification Any Degree. Must be Married. Salary Upto: 20,000/- place of work Master Minds College. Guntur. Contact: 9248733344

■ బాపట్ల లక్ష్మీ శ్రీనివాస సుజుకి షోరూం నందు పని చేయుటకు సేల్స్‌మెన్స్-4, మెకానిక్స్-4, హెల్పర్స్-2, సర్వీస్ అడ్వైజర్-3, కంప్యూటర్ ఆపరేటర్-1 కావలెను. లోకల్‌వారికి ప్రాధాన్యత. 9248488115

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోం వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం 15-20 వేలు. కాల్/ వాట్సప్ చేయగలరు. సంప్ర. సెల్ : 95026 15217

■ డ్వాక్రామహిళలకు, నిరుద్యోగులకు, ఇంట్లో ఉంటూ పెట్టుబడి మీరే పెట్టుకొనికావొత్తులు, పెన్సిల్స్ తయారుచేసి మాకు ఇవ్వండి. గ్రూప్‌లకు ఉచిత శిక్షణ. 9491995565

■ విజయవాడలో పెద్దవారిని/బెడ్ పేషెంట్లని వారి ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు కేర్‌టేకర్స్ M/F, ఆయాలు, నర్సులు కావలెను. వసతి + భోజనం + మంచి జీతం. ✆ 91608 35559, 98850 25559

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం జీ:18K. ఫోన్: 9640258899/9640468899

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4లైన్స్)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
ఈ పత్రికలో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తాపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈదురుగాలులకు కూలిన స్తంభాలు



చుండూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద పడిపోయిన చెట్టు



చుండూరులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై కూలిన చెట్టు

విద్యుత్ సరఫరాకు అంతరాయం

చుండూరు(వేమూరు): ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వల్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంట్ స్తంభాలు పడి పోవడంతో మండలంలో మంగళవారం విద్యుత్ అంతరాయం ఏర్పడిందని విద్యుత్‌శాఖ ఇంజినీరు దోనేపూడి అర్జునరావు చెప్పారు. మండలంలో మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 5.30 వరకు ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షం కురిసిందని, దీనివల్ల చెట్లు కూలి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై పడ్డాయని, కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపోయాయని, కొన్ని గ్రామాల్లో రోడ్ల పక్కనున్న తాటిచెట్లు విద్యుత్ వైర్లపై పడి స్తంభాలు విరిగిపోయాయని తెలిపారు. మండలంలోని కేస్ పల్లి, పెదగాదెలవర్రు గ్రామాల్లో కరెంట్ స్తంభాలు పడిపోవడం జరిగిందన్నారు. గ్రామాల్లో విద్యుత్ సప్లయి చేసేందుకు క్రేన్ తీసుకొచ్చి పడిపోయిన చెట్లు తొలగించడం జరిగిందన్నారు. నూతన స్తంభాలు వేసి వినియోగదారులకు విద్యుత్ సరఫరా అందించడం జరుగుతుందన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చాంద్‌బాషా, పక్కన ఉద్యోగ సంఘ నాయకులు

గుంటూరు మెడికల్: సీపీఎస్, జీపీఎస్ బిల్లు రద్దుపై పునరాలోచన చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా ప్రభుత్వాన్ని కోరారు. సంఘం జిల్లా కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ ఉద్యోగుల సమావేశం జరిగింది. చాంద్ బాషా మాట్లాడుతూ రాబోవు రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో సీపీఎస్ జీపీఎస్ బిల్లు రద్దుపై పునరాలోచన చేసి, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడాలని కోరారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగులు కోరి తెచ్చుకున్న ఈ ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరిస్తుందని ఆశాభావంతో ఉన్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె.వి.ఎస్.శివారెడ్డి, నగర శాఖ అధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యదర్శి పెద్ద రత్తయ్య, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి సుమిత్రా దేవి, రోజా రాణి, రమణి, జిల్లా ఉపాధ్యక్షులు పద్మజ, నీలిమా, నగరశాఖ ఉపాధ్యక్షులు లీలాబాయి , రాధాకృష్ణ, తాడికొండ, తాలూకా యూనిట్ అధ్యక్షులు సుబ్బారావు, లక్ష్మీ నారాయణ, రత్తయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు, చిత్రంలో నిందితులు(కూర్చున్న వారు)

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వే స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో 1వ నంబర్ ప్లాట్‌ఫాం పై తెలంగాణ మద్యం బాటిళ్లను జీఆర్పీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సీఐ గంగావెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. గుంటూరు రైల్వే స్టేషన్ 1వ నంబర్ ప్లాట్‌ఫాంపై జీఆర్పీ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వెంటాద్రి సిబ్బందితో కలిసి సాధారణ తనిఖీలు చేస్తుండగా రెండు బ్యాగులతో వస్తున్న డొకిపర్రు గ్రామానికి చెందిన కొజ్జా సాంబయ్య, పేరేచర్లకు చెందిన మైల రవికుమార్ అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేశారు. బ్యాగుల్లో తెలంగాణ మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. రైళ్లలో మాదకద్రవ్యాలు, మద్యం సరఫరా చేస్తే కఠిన చర్యలు తప్పవని వివరించారు.

27న రైతు సమస్యలపై వినతి పత్రాల సమర్పణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏరువాక మహోత్సవంలో భాగంగా ఈనెల 21న రైతులు తమ అరకలు, ట్రాక్టర్లతో ఏరువాక సాగించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. సంప్రదాయ వ్యవసాయంలో భాగంగా రైతులు వినియోగించే ఎద్దులు, ఎడ్ల బండ్లను 50శాతం రాయితీతోను, ట్రాక్టర్లను వినియోగించే రైతులకు అవసరమైన డీజిల్‌ను 50 శాతం సబ్సిడీతో ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం విస్తృత కౌన్సిల్ సమావేశం జూమ్ వేదికగా జరిగింది. ఈ సమావేశంలో రైతు సమస్యలపై పలు తీర్మానాలు చేశారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై జూన్ 27న రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేయాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో రైతు నాయకులు పి, జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ కళాకారుడు కోటేశ్వరరావు మృతి



ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరంకు చెందిన సీనియర్ కళాకారుడు వంగర కోటేశ్వరరావు(85) మంగళవారం మృతి చెందారు. ఈయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈయన సాంఘిక, పౌరాణిక నాటకాల్లో పలు పాత్రలు పోషించడమే కాకుండా కొన్నింటికి దర్శకత్వం వహించారు. బేతా వెంకట్రావు నాటక కళామందిర్ నాటక సంస్థను స్థాపించి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు సంబంధించిన కళాకారుల పింఛన్ల విషయంలో ఎంతగానో కృషి చేశారు. చింతామణిలో భవానీగా, మయసభ నాటకంలో దుర్యోధనుడిగా మెప్పించారు. ఐలవరంలోని రామమందిరానికి సంబంధించి ముఖ మండపం దాతగా ఒక మండపాన్ని నిర్మింపచేశారు. ఆయన మృతిపై గ్రామానికి చెందిన కళాకారులు దీపాల సత్యనారాయణ, దీపాల సుబ్రహ్మణ్యం, కౌతరపు శివశంకరరావు సిద్ధాంతి, బూదాటి శివ నాగేశ్వరరావు, బిట్రా వెంకటేశ్వర్లు, జంజనం హేమశంకరరావు తదితరులు సంతాపం తెలిపారు.

స్పోర్ట్స్ అకాడమీలను పునఃప్రారంభించండి

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్రంలో మూతబడ్డ స్పోర్ట్స్ అకాడమీలను తిరిగి ప్రారంభించాలని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ఆంధ్రా కబడ్డీ సంఘ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ విన్నవించారు. విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మంత్రి రాంప్రసాదరెడ్డిని ఆయన మర్యాద పూర్వకంగా కలుసుకుని ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా స్పోర్ట్స్ అకాడమీలు ఉండేవని, కాలక్రమేణా అవి మూతబడుతూ వచ్చాయని తెలిపారు. క్రీడాకారులకు ఎంతో ఉపయోగంగా వుండే ఈ అకాడమీలను తిరిగి ప్రారంభించాలని కోరారు. కబడ్డీ లీగ్‌లను నిర్వహించి కబడ్డీ క్రీడాభివృద్ధికి సహకరించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో కృష్ణాజిల్లా కబడ్డీ సంఘం మాజీ కార్యదర్శి నాంచారయ్య ఉన్నారు. తొలుత మంత్రికి వారు శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని బహూకరించారు.


నాటక రంగానికి యువసత్వాలు!

- తెలుగు నాటకంలో సరికొత్త ప్రయోగం.. 'సంస్కృతి యువ నాటికలు'
- యువత కోసం ప్రయోగాత్మక నాటికల సంకలనం
- ఈనెల 23న గుంటూరులో ఆవిష్కరణ

తెనాలి: గుంటూరుకు చెందిన ప్రసిద్ధ సంగీత, సాహిత్య, నృత్య, నాటక సంస్థ 'సంస్కృతి' గతేడాది యువ నాటికల పోటీలను నిర్వహించింది. బహుమతి పొందిన ఆరు నాటికలను ఒక సంకలనంగా రూపొందించింది. 'సంస్కృతి యువనాటికలు' పేరుతో తీసుకొచ్చిన ఆ గ్రంథావిష్కరణ సభను ఈనెల 23న సాయంత్రం 6.30 గంటలకు గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞానమందిరంలో ఆవిష్కరించనున్నారు. రాష్ట్రంలోని నాటకరంగ ప్రముఖులు ఈ వేడుకకు హాజరుకానున్నారు.

మూస ధోరణికి చెక్ పెట్టేలా..!

1980ల వరకు యువతరం గ్రామాల్లో, పట్టణాల్లో పండగల సందర్భాల్లో నాటకాలను ప్రదర్శిస్తూ ఉండేవారు. పెద్ద రచయితలు నాటక సమాజాలకు అనువైన నాటకాలను అందిస్తూనే, వర్ధమాన సమాజాలకు స్త్రీ పాత్రలేని సమస్యాత్మక నాటికలు, హాస్యనాటికలు ప్రత్యేకంగా రాసేవారు. పాఠశాలలు, కాలేజీల్లోనూ వీటిని విద్యార్థులు ప్రదర్శించేవారు. రానురాను ఆ పరిస్థితుల్లో మార్పు వచ్చింది. తెలుగు నాటకరంగం పరిషత్ పోటీలకే పరిమితమైందనేది కాదనలేని సత్యం. పరిషత్ పోటీల్లో ప్రసిద్ధి పొందిన నాటక సమాజాల ప్రదర్శనలకే అవకాశం దక్కుతోంది. అందులోనూ ఎక్కువగా మూస ఇతివృత్తాలే ఉంటున్నాయి. నాటకోత్సవాలు/ నాటక పోటీలకు ప్రేక్షకాదరణ కొరవడుతోంది. ఏ పోటీ ప్రదర్శనలను చూసినా, పెద్దలు మినహా యువత కనిపించని దుస్థితి. ఇలాగే కొనసాగితే తెలుగు నాటకం మసకబారే ప్రమాదముంది. ఈ పరిస్థితిని నివారించటానికి కొన్ని కళాసంస్థలు రకరకాల ప్రయోగాలను చేస్తున్నాయి.



సంస్కృతి యువ నాటికల సంకలనం

యువత నాటక రంగంవైపు మళ్లేలా..

భిన్నమైన ఇతివృత్తాలు, సామాజిక అంశాలతో నాటక రచనలను ప్రోత్సహించే లక్ష్యంతో అజో-విభో-కందాళం ఫౌండేషన్ కొన్నేళ్లుగా కథానాటికల పోటీలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉత్తమమైన కథలను ఎంచుకుని నాటికలుగా మలచిన రచయితలకు నగదు బహుమతులను అందిస్తూ, ఆయా నాటికలను సంకలనాలలుగా ప్రచురిస్తోంది. తెనాలికి చెందిన కళల కాణాచి సంస్థ నిర్వహిస్తున్న పోటీల్లో ప్రదర్శించే నాటికలను సంకలనంగా ప్రచురిస్తోంది. ప్రేక్షకుల్లో పద్యానికి గల ఆదరణను దృష్టిలో ఉంచుకుని సాంఘిక పద్యనాటక రచనలను ప్రోత్సహిస్తోంది. మరోవైపు హైదరాబాద్‌లో నాటక దర్శకులు ఆధునికంగా నాటకాలను ప్రదర్శిస్తూ యువతను ఆకర్షిస్తున్నారు. టికెట్లతో నాటకాలను ప్రదర్శించే స్థాయికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో సంస్కృతి సంస్థ వ్యవస్థాపకుడు సత్రాజు బాలచందర్ నాటక ప్రదర్శనలకు యువతను చేరువ చేయాలనే నిర్ణయం తీసుకున్నారు. యువత కూడా నాటకంలో భాగస్వాములు కావాలంటే వారికి అవకాశాలు ఇవ్వాలి.. వాళ్లకు పోటీలతో సంబంధం లేకుండా ప్రదర్శనవకాశాలను కల్పించాలనేది ఆయన భావన. ఇందుకోసం యువత అభిరుచికి, సామర్థ్యానికి తగిన రచనలు అవసరమని గుర్తించారు. నంది నాటక పోటీల ప్రవేశించి నాటికల ప్రదర్శనా కాలపరిమితి గంటకు చేరిపోయింది. వీటికి తయారయేందుకు వారికి వెసులుబాటు ఉండకపోవచ్చు. అందుచేత అర్ధగంట కాలపరిమితికి లోబడిన నాటికల ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తే వారు పాలుపంచుకుంటారు. పోటీలను చూసేందుకు యువతరం వస్తుందన్న ఆలోచన చేశారు.

సంకలనంగా యువ నాటికలు..

అలాంటి రచనల కొరత తీర్చేందుకని సంస్కృతి సంస్థ యువనాటికల పోటీలను నిర్వహించింది. యువత ఎదుర్కొనే సమస్యలు ప్రధానాంశంగా కొత్త నాటికలు రాయాలని రచయితలకు పిలుపునిచ్చింది. పోటీకి వచ్చిన నాటికల్లో ఉత్తమమైన వాటిని ఎంపికచేసింది. వాటికి ప్రథమ, ద్వితీయ అనే బహుమతులు కాకుండా ఎంపిక చేసిన ఆరునాటికలను బహుమతి మొత్తాన్ని సమానంగా అందజేయటం మరో విశేషం. పీవీ శేషారత్నం రచించిన 'జాగృతి', వల్లూరు శివప్రసాద్ నాటిక 'ఉన్మాదం', మధిర బాబ్జీ రాసిన 'తల్లిదండ్రులూ...తస్మాత్ జాగత్త', బీవీ శివప్రసాద్ రాసిన 'భూతం', ఎస్ఎస్ నారాయణ బాబు రచన 'అఆఇఈ', రావుల కిరణ్మయి రచించిన 'మేలుకొలుపు' నాటికలతో 'సంస్కృతి యువ నాటికలు' సంకలనంగా తీసుకొచ్చారు. ఈ పుస్తకాన్ని ఆంధ్ర నాటకరంగానికి, ముఖ్యంగా ఔత్సాహిక సమాజాలకు, నటీనటులకు అదుబాటులోకి తీసుకొస్తున్నారు. 'భవిష్యత్‌లో ఇలాంటి మరిన్ని రచనలు రావటానికి మా తొలి ప్రయత్నం దోహదపడుతుందని ఆశిస్తున్నాం' అని బాలచందర్ చెప్పారు. పరిషత్ పోటీల నిర్వాహకులు యువ నాటికల ప్రదర్శనలకు అవకాశం కల్పించాలని అభ్యర్థించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చీరాల: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చీరాల మండలం ఈపూరుపాలెంలో చోటుచేసుకుంది. ఈపూరుపాలెంలో అడ్డరోడ్డు వద్ద గల హైస్కూల్ సమీపంలో బుజ్జి(23) అనే యువకుడు బడ్డీ కొట్టు నడుపుతుంటాడు. సోమవారం రాత్రి బాత్‌రూమ్‌కు వెళ్లిన అతడు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. విద్యుత్ తీవ్రతకు శరీరం మొత్తం కాలిపోయింది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు ఈపూరుపాలెం రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్కివారిపాలెంలో కొనసాగిన వైద్యశిబిరం

అక్కివారిపాలెం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని అక్కివారిపాలెంలో మంగళవారం కూడా వైద్య శిబిరం కొనసాగింది. గ్రామంలో డయేరియా తగ్గుముఖం పట్టినప్పటికీ శిబిరం శుక్రవారం వరకు కొనసాగించనున్నట్లు వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యురాలు చావలి రామలక్ష్మి తెలిపారు. ఎటువంటి కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద నిర్వహించిన ఈ శిబిరంలో వెల్లటూరు పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ కేకే నాగేశ్వరరావు, ఎంపీహెచ్ఎస్ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్లు శివరామకృష్ణ, శ్రీనివాసరావు, హెచ్‌వీ రాజ్యలక్ష్మి, సచివాలయ ఏఎన్ఎం వి.లీలారాణి, ఎంఎల్‌హెచ్‌పీ ఆశాజ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇద్దరు రైల్వే ఉద్యోగులకు సేఫ్టీ అవార్డులు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైళ్ల నిర్వహణలో లోపాలను గుర్తించి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించిన విజయవాడ డివిజన్‌కు చెందిన ఇద్దరు ఉద్యోగులు 'జీఎం మ్యాన్ ఆఫ్ ద మంత్ సేఫ్టీ అవార్డు - మే 2024' అందుకున్నారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం నుంచి విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌తో పాటుగా సికింద్రాబాద్, హైదరాబాద్, గుంటూరు, గుంతకల్లు, నాందేడ్ డివిజన్ల డీఆర్ఎంలతో వర్చువల్ పద్ధతిలో సమీక్ష సమావేశంలో నిర్వహించారు. ప్రయాణికుల సురక్షిత ప్రయాణం, భద్రతలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రమం తప్పకుండా అన్ని సెక్షన్లలో సేఫ్టీ డ్రైవ్‌లు నిర్వహించాలని, ముఖ్యంగా రాత్రిపూట తనిఖీలు నిర్వహించి లోపాలను గుర్తించి అప్రమత్తంగా వ్యవహించాలని ఆదేశించారు. అనంతరం విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించిన గొల్లప్రోలు స్టేషన్‌లోని పాయింట్ మెన్ బి.మురళి, ఉలవపాడు స్టేషన్ ట్రాక్ మెన్ పి.శ్రీనివాసులకు దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ తన కార్యాలయంలో అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందించారు.

సికిల్ సెల్ అనీమియా మిషన్‌ను విజయవంతం చేద్దాం



బాలబాలికలతో మాట్లాడుతున్న పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి

రెంటచింతల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలనకు చేపట్టిన మిషన్‌ను విజయవంతం చేయాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి కోరారు. ప్రపంచ సికిల్ సెల్ అనీమియా డే సందర్భంగా మంగళవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వివిధ గ్రామాలలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పరీక్షలు చేయిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 214 మందికి పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని గిరిజన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.కోటేశ్వరరావు, పీహెచ్‌సీ సిబ్బంది మహేష్‌బాబు, డి.సీతారామిరెడ్డి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నాదెండ్లలో అంగన్‌వాడీ బాట

గ్రాడ్యుయేషన్ డేలో చిన్నారులకు పత్రాలు పంపిణీ



చిన్నారుల గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పీడీ ఉమారాణి, సీడీపీవో శాంతకుమారి

నాదెండ్ల: మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరేలా తల్లిదండ్రులను ప్రోత్సహించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు పీడీ కె ఉమారాణి అన్నారు. నాదెండ్ల సీడీపీవో కార్యాలయాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ముందుగా ప్రాజెక్టు సమావేశం నిర్వహించారు. అనంతరం ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రాథమిక పాఠశాలలో చేర్పించేందుకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీల్లోని చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ధృవపత్రాలతో సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ బాట కార్యక్రమంపై మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందించాలన్నారు. చిన్నారులకు క్రీడా పరికరాల ద్వారా విద్యా బోధన చేయించాలన్నారు. రక్తహీనత ఉన్న గర్భిణులు, బాలింతలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీలకు అందించే సౌకర్యాలను చిన్నారులు, గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీడీపీవో శాంతకుమారి, ఏసీడీపీవో నిర్మలారాణి, సూపర్‌వైజర్ జోజమ్మ, నిర్మలకృష్ణమాల, ఉషారాణి, భూలక్ష్మి, పద్మావతి, రమణ, రమాదేవి పాల్గొన్నారు.

సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించాలి



ఏడీ లావణ్యకు వినతి పత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని జెడ్పీ, మున్సిపల్, నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల నిష్పత్తికి సరిపడా సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించాలని ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు కట్టెబోయిన నరసింహారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ కె.లావణ్యకు వినతి పత్రం సమర్పించారు. ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పెరిగిన విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో బోధన సవ్యంగా సాగడం లేదని పేర్కొన్నారు. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లోని మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు పుష్కలంగా ఉన్నా.. ఉపాధ్యాయులు సంఖ్య చాలా తక్కువగా ఉందని వివరించారు. ఈ విషయమై తక్షణమే తగు చర్యలు చేపట్టాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు జె. విజయానంద్, జిల్లా సహాధ్యక్షుడు ఓగిబోయిన నాగార్జున పాల్గొన్నారు.

పిడుగుపడి ముగ్గురికి గాయాలు

రొంపిచర్ల: మండలంలోని సుబ్బయ్యపాలెం గ్రామ పొలాల్లో పిడుగుపడి ముగ్గురు గొర్రెల కాపర్లకు తీవ్ర గాయాలయ్యాయి. గొర్రెలు కాస్తూ కుంట కట్టపై ఉన్న నేరేడు చెట్టు కింద భోజనం చేస్తున్నారు. పిడుగుపడి చెట్టుపై పడటంతో ముగ్గురు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ప్రమాదంలో చెల్లం చెర్ల ఆంజనేయులుకు నడుం వద్ద నుంచి కింద భాగం, ఏల్చూరు ముసలయ్య, అంజయ్య కూడా అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వీరు ముగ్గురు నరసరావుపేట ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు.

రక్తదాతలకు సన్మానం



శివశంకర్, ప్రేమ్‌కుమార్‌లను సన్మానిస్తున్న నాగేశ్వరరావు, రమేష్ తదితరులు

తెనాలిఅర్బన్: ప్రపంచ రక్తదాన దినోత్సవ వేడుకల్లో భాగంగా నాజర్‌పేటలోని శ్రీశ్రీ కళావేదిక జిల్లా కమిటీ కార్యాలయంలో మంగళవారం 58 సార్లు రక్తదానం చేసిన సత్యం, శివం, సుందరం సామాజిక వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్, 29 సార్లు రక్తదానం చేసిన తెనాలి ఆర్టీసీ డిపో ఉద్యోగి ఈపూరు ప్రేమ్‌కుమార్‌కు రక్తదాన కర్ణులు అనే బిరుదును ప్రదానం చేసి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రంగిశెట్టి రమేష్, ప్రధాన కార్యదర్శి ఆళ్ల నాగేశ్వరరావు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, సిద్ధాబత్తుని సుబ్రమణ్యం, విష్ణుమొలకల భీమేశ్వర ప్రసాద్, డాక్టర్ పెద్దెటి యోహాన్, కె.విజయ్, ఎస్. బద్రీనాథ్, ఎంవీ రఘునాథరావు, ఆళ్ల సుజాత, తదితరులు పాల్గొన్నారు.